
ప్రయాణాలంటే, ముఖ్యంగా రైలు ప్రయాణాలంటే ఇష్టపడే నాకు బెంగుళూరు నుంచి ఇంటర్వ్యూకి కాల్‌లెటర్ రావడం ఎంతో సంతోషం కలిగించింది. మాలో చాలా మందికి మొదటి ఇంటర్వ్యూ కావడంతో చాలా ఆసక్తి కనబర్చాము. రైలు బయలుదేరిన దగ్గర్నుండి ఎవరికి వారు పుస్తకాలలో తలలు దూర్చేశారు. సాధారణంగా నలుగురు స్నేహితులు కలిస్తే, అదీ కలసి ప్రయాణిస్తే హస్కు తప్పితే వేరే వ్యాపకం ఏముంటుంది? కానీ పరిస్థితి ఇంత విరుద్ధంగా, విపరీతంగా ఎందు కుందో తెలుసా - అంతా ఇంటర్వ్యూ మహాత్మ్యం మరి.



# గుంతకల్లు కాఫీ

## డొక్కా రామభద్రరావు

తెల్లవార వస్తోంది! విరామమెరుగని బాటసారిలా రైలు పయనిస్తూనే వుంది. మెల్లమెల్లగా ఒక్కొక్కరూ నిద్రాదేవి చెర నుంచి విముక్తులవుతున్నారు. రైలు పెట్టెలోని వారంతా పరిచయస్తుల్లా ఒకరినొకరు పలకరించుకొంటూ ఒక మాదిరి రైలు కుటుంబాన్ని ఏర్పాటు చేసేసుకున్నారు.

ఒకాయన డిప్యూటీ తాసిల్దారు - అనంతపురంలో పండుగ సెలవలకు హైదరాబాద్ వచ్చి వెడుతున్నాడు.

మరొకాయన మరాఠీ. బెంగుళూరు దాటి ఇంకా చాలా దూరం వెడుతున్న వాడిలా వున్నాడు. మరొకరు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తూ, తమ సొంతవూరు ధర్మవరం వెడుతున్నారు. వేరొకరు మనవడి పెళ్ళికి బెంగుళూరుకు సకుటుంబంగా ప్రయాణం కట్టారు. వేరొకాయన పంజాబీ. Air Force లో పనిచేస్తూ డ్యూటీ మీద బెంగుళూరుకు వెడుతున్నారు. ఇలా రైలు కుటుంబ సభ్యులంతా ఒకరినొకరు తెలుసుకున్నారు. పరిచయ కార్యక్రమం పూర్తయ్యాక ఆ రైలు పెట్టె ఒక చర్చావేదిక లాగా మారిపోయింది. మునిగిపోయిన బుద్ధ విగ్రహం గురించి ఒకరు, ఆగిపోయిన మధ్యాహ్న భోజన పథకాల గురించి మరొకరు, కావేరి జలవివాదం గురించి ఒకరు, భారత క్రికెట్ భవితవ్యం గురించి ఒకరు - ఎవరి ధోరణి వారిది. అక్కను వెళ్ళకక్కే వారు కొందరైతే, గవర్నమెంటునీ, పరిపాలననీ తమ వాగ్ధాటితో దులిపేసేవారు కొందరు. కొందరు ఏకంగా IMF గురించి, అమెరికా గురించి మాట్లాడుకొంటున్నారు. "మొన్న బుష్షుకీ, రీగన్నుకీ గొడవ వచ్చిందట గదా!" చెప్పుకుపోతున్నాడొకాయన. మరి కొందరు రెండు బెర్తుల మధ్య సూట్‌కేసులు పెట్టి పైన చతుర్ముఖ పారాయణం మొదలుపెట్టేశారు.

*************

గుంతకల్లు స్టేషను వచ్చింది. సమయం 5-30, 6 గంటల మధ్య వుండొచ్చు. చీకటి పరదా తొలగించడానికి వేకువరాణి సిగ్గు పడుతున్నట్లుగా వుంది. ఆ నల్లని మేలిముసుగులోని మణుల్లా తారలు మిణుకుమిణుకుమంటూ అదృశ్యమవుతున్నాయి ఒక్కటొక్కటిగా. తూరుపు కిరణాలు - తమ చుట్టూ అలముకొన్న మబ్బులను అదలించడం ఇష్టం లేకనేమో - ముందుకు సాగుదామా! వద్దా? అని సంశయిస్తున్నట్లున్నాయి. చల్లగాలి పవనాలు మెల్లగా తాకి తమదారిన తాము పోతున్నాయి. ముగ్ధమనోహర స్నిగ్ధసౌందర్య వనిత - ప్రకృతి కాంత చిగురుటాకుల నుండి జారు మంచు బిందువులనూ, తీగపొదలపూచిన పుష్పలతలనూ ఆప్యాయంగా తన ఒడిలోకి తీసుకొంటోంది. ఇంత ఆహ్లాద భరిత వాతావరణంలో - పరుగెత్తే అశ్వాన్ని బలవంతాన వెనక్కు లాగినట్లుగా కీచుమంటూ అయిష్టంగా రైలాగింది.

అందరికీ ఒకటే ఆలోచన. కానీ ఎవరు ముందు బయటపడతారా, తమ మనసులోని మాటను బయట పెడతారా, సపోర్టిచ్చేద్దామని ఎదురు చూస్తున్నారంతా. ఇంతలో...

*************.

ఒక కుర్రాడు ఫ్లాట్ ఫాం పైనుంచి అరుస్తూ వెడుతున్నాడు... "కాఫీ! కాఫీ, కాఫీ!!" అంటూ. నిండా పదేళ్ళుండవతనికి.

"ఇక్కడ కాఫీ భేష్షుగ్గా ఉంటుందండీ!" ఒకాయన మొదలు పెట్టాడు ఫ్లాట్‌ఫాం కుర్రాడి అరుపు విననివాడిలా ఫోజిస్తూ. మనవన్నీ ఉషోదయం కాకముందే ఉత్తనీళ్ళో, వేణ్ణీళ్ళో కాస్త కాఫీనీళ్ళు పడందే కదలని బండ్లు కదా.



"పెళ్లి పీటల మీద నుంచి లేచావో లేదో, అప్పుడే సూటూ, బూటూ, టై, తీసేశావేమిట్రా?" తల్లి గద్దించింది పెళ్లి కొడుకుని.

"మరి! ఆ ముగ్గురు ఫ్రెండ్సూ అర్జెంటుగా వెళ్లిపోవాలన్నారు లేవే!" చల్లగా చెప్పాడు కొడుకు.

బచ్చు వీర్రాజు
[రాజమండ్రి]

"అవునవును! గుంతకల్లు కాఫీ ప్రాశస్త్యమే వేరు!!" ఉపన్యాసం దంచపోయారో దాసుగారు.

"ఆఁ! బాగా చెప్పారు!!" అవతలి ప్రక్కనుండొక కంఠం సపోర్టింగ్. మొత్తానికి అంతా కలిసి ఆ కాఫీ కుర్రాడిని పెట్టెలోనికి పిలిచారు.

కాఫీ వెల తెలుసుకోకుండానే తనకూ, తన స్నేహితునికీ రెండు కాఫీలు ఆర్డరిచ్చారు తాసిల్దారుగారు వాళ్ళ స్నేహితుడు తనకు వద్దన్నా వినకుండా. అంతే! అరక్షణంలో మాయమై మరో పావులో అరక్షణంలో చేతిలో రెండు ప్లాస్టిక్ గ్లాసులతో సహా ప్రత్యక్షమయ్యాడా కుర్రవాడు.

తమ నాలుకలు పీకుతున్నా ఏం జరగబోతోందా అని బ్రహ్మాండమైన స్కోపు సినిమా చూడసాగారు చాలా మంది. ఇంక ఆగలేని మరొకరిద్దరు కూడా కాఫీలకు సిద్ధమయ్యారు. స్నేహితుని త్రాగమని బలవంత పెట్టేసి, తన గ్లాసందుకున్నారు తాసిల్దారుగారు. పెట్టెలో మొదటి కాఫీ నాదేనన్న భావంతో గటగటా త్రాగేసి ఐరావతాన్ని వేలం పాటలో కొట్టేసినంత ఆనందంగా చూశాడాయన అందరి వంకా.

** ** **

"ఎంతయ్యిందిరా??" ఈ ప్రశ్న మరో మహాభారత సంగ్రామానికీ, మూడవ ప్రపంచ యుద్ధానికో దారి తీస్తుందని తెలియక అడిగేశాడాయన.

"అయిద్రూపాయలు!"

"ఏంటీ ఈ ఛండాలపు కాఫీకి అయిద్రూపాయలా?"

-రెండు కాఫీలండి ఒకటీ రెండున్నరండి!!"

"అయినా, కాఫీ రెండున్నరేమిటండీ - ఎక్కడైనా ఉందా" కన్విన్సింగ్‌గా అందరి వంకా చూశాడాయన.

"మరింకెంతేవిటండీ?" రెట్టించాడా బుడత. వాడి కాఫీని అవమానపరిచేసరికి రోషం ముంచుకొచ్చింది వాడికి.

"ఇది పది పైసల విలువ కూడా చేయదు తెలుసా!" తన తెలివితేటల్నీ చాకచక్యాన్నీ వాక్చాతుర్యాన్నీ కలిపి ప్రదర్శించాడాయన.

ఈ గొడవకు పెట్టెలో నిద్రపోతున్న మరి కొంత మంది లేచారు. అంతా ఏం జరుగుతుందా అని చూడసాగారు.

"నాకేం తెల్దు ముందు డబ్బులియ్యండి రైలు కదలబోతోంది."

"ఏందిరా ఇచ్చేది, నాలుగు తన్నులిస్తా! అసలు రైల్వేవాళ్ళు కాఫీ, టీలు ముప్పావలా మించి అమ్మకూడదని రూలు పెట్టారండీ!!" అంటూ అప్పుడే పార్లమెంటులో బిల్ పాస్ చేసి వచ్చినవాడిలా చెప్పాడాయన అందరికీ.

"లేదండీ అవసరం మనది కదా చచ్చినట్లు తాగుతామని, తాగిన తరువాత ఎంతైనా ఇవ్వక తప్పదని - ఈ రైల్వేవాళ్ళు కూడా ఇంతేనండీ" అందుకున్నారొకాయన.

"ఒక కాఫీ త్రాగలేదు కాబట్టి పట్టుకుపో! ఒకదానికి 75 పైసలు తీసుకో ఆయనిస్తాడుఁ! ఆఁ ఏమండీ! మీ దగ్గర చిల్లర ఏమైనా...

"ఐ డోంట్ హేవ్ ఛేంజ్" అంటూ ఇంగ్లీషులో నసిగాడు.

ఆ మాటల్లో 'ఛేంజ్' అన్న ముక్క అర్థమైనట్లుంది. ఆ కాఫీ వాడు "చిల్లర నేను తెస్తాను నోటియ్యండి!" అన్నాడు.

"నేన్నీకు నోటిస్తే మళ్ళీ వస్తావా, నేను నమ్మాలా! వెధవ తెలివి ప్రదర్శించకు! డబ్బులు లేవు గిబ్బులు లేవు ఫో!" గదమాయించాడు తాసిల్దారు.

"కావల్తే వచ్చి మా సేటు నడగండి!! కాఫీ రెండున్నరే, ముందు పైసలిప్పించండి!"

"నేను భువనేశ్వర్ నుండి వస్తున్నానండీ! కాఫీ రెండున్నర మాట ఎక్కడా వినలేదండీ బాబూ!!" మొదలుపెట్టాడొకాయన.

"దారుణమా, మరీ దారుణమా! సాగదీశాడింకొకాయన.

"సార్ రైలు కదిలింది, నా పైసలియ్యండి" ఆ కుర్రాడి గొంతులో ధైర్యం సన్నగిల్లింది.

"ఏం లేదు ఫోరా!"

"సార్ మీరియ్యకపోతే నా పైసలు కట్టయితయ్. మా సేటు నాకిచ్చేదే దినానికి పది రూపాయలు." ఆత్రం హెచ్చింది.

"చెబితే నీకు కాదురా ఫో!!"

"సార్! ప్లీజ్ బండి పోతోంది సార్!!" బ్రతిమాలుతున్నాడు వాడు.

"పోనీరా! రా ఎంత దూరం వస్తావో చూస్తా!"

ఇహ లాభం లేదనుకున్నాడేమో, ఆ కుర్రవాడు రన్నింగ్‌లో ట్రైను దిగిపోయాడు. ఈ దరిద్రపుగొట్టు బేరాన్ని మనసారా తిట్టుకుంటూ. అప్పటికే రైలు స్పీడందుకుంది. "సార్! నీయ......" వాడి గొంతు రైలు శబ్దంలో కలిసిపోయింది. ఆ గొంతులో ఉబికిన ఉక్రోషం అలా అలా తగ్గి అతని రూపం మెల్ల మెల్లగా వెనక్కిపోయింది ఫ్లాట్‌ఫాంపైన. "వెధవ పొగరూ వీడూ! లేకపోతే ఏమిటండీ!!" సమర్థించుకొంటున్నాడా తాసిల్దారు. వెనుకకు పోతున్న కుర్రాడి వంకే చూస్తున్న నేను అతని తిట్లన్నీ శాపనార్థాలనీ పోల్చుకోగలుగుతున్నానే కానీ - అతడి గుండెల్లోని బాధనీ, ఆవేదననీ అర్థం చేసుకొనేదెవరు?"

యింతలో రైల్లో.... ‿

"గుంతకల్లు కాఫీ అంతా వట్ఠి నీళ్ళండీ!" - యిందాకా పొగిడి నాయనే తెగిడాడు.

"అసలీ కాఫీ వాళ్ళంత యింతేనండీ !!" దీర్ఘ చర్చా ప్రారంభోత్సవం చేశాడొకాయన.

"అయినా కాఫీ ఏమిటండీ? అందులో డీకొటిన్ ఉంటుందిట అది ఆరోగ్యానికి సుతరామూ మంచిది కాదండీ! అందుకొన్నారింకొకరు.

"డికొటిన్ కాదు "నికొటిన్" మరొకరి కరెక్షన్.

"అవునవును" అన్నారొక వంతగారు.

"అది కాఫీ సిగరెట్లు మొదలైన వాటన్నిటిలో వుంటుందిట." మళ్ళీ అందుకున్నారు వంతగారు.

"అవునండవునవును !" మరొక వంత.

"మొత్తానికి కాఫీ త్రాగడం ఆరోగ్యానికి అన్ని విధాలా అపాయకరం!"

-ఎలాగైతేనేం సాయం వట్టి తీర్మానించేశారంతా. అలసిపోయేదాకా మాటలాడి అనహనంగా తీర్పు చెప్పేశారు. నెమ్మదిగా అంతా నర్దుమణిగింది.

★ ★ ★

రైలు మళ్ళీ ఆగింది. యీసారి బద్ధకం వదలిన సూర్యుడు నిద్రకళ్ళతో మెల్లగా తూరుపు కొండలకావల నుండి పైకెగ బ్రాకుతున్నాడు. తొలి కిరణాల లేత ఎండకి, వెచ్చదనానికి మునుగులు తన్ని చలికి మూలుగుతున్న వారందరిలో చిన్నగా చైతన్యం ప్రారంభమయింది.

"కాఫీ, కాఫీ! కాఫీ సార్ కాఫీ !!" ఒక 25-30 సంవత్సరాల మధ్య వయస్కుడు కాఫీ క్యాను పట్టుకొని పెట్టెలోకి ఎక్కి అరిచాడు.

"కాఫీ కాఫీ... !!" రెండవ సారి అతను పిలుపు పూర్తికాకుండానే ఒక్కసారిగా జనం అంతా వాడిపైన వాలిపోయారు. వాడి ఆనందానికి అవధులు లేవు. క్యాను కాఫీ అయిదు నిమిషాల్లో అయిపోయింది. మావాడు కూడా రెండు కాఫీలు తీసుకొన్నాడు. రేటు అడగకుండానే అయిదు రూపాయలిచ్చాడొకాయన. ఆ కాఫీ వాడు తిరిగి 2 రూ॥ చేతిలో పెట్టాడు. అవతలి పార్టీ ఏం నోరెత్తలేదు. అంతా యిది గమనిస్తూనే వున్నా - రపామని మూడేసి రూపాయలు తీసియిచ్చేశారు.

ఇంతసేపు చర్చించి, తీర్మానించిన వాళ్ళేనా వీరంత అనిపించింది. కాఫీ 2.50 అంటే ఏదో తాజ్‌మహల్ కూలిపోయిందన్నట్లు "నేను వినలేదు కనలేదని" దెబ్బలాడిన పెద్ద మనిషే ముందు చకచకా లాగించేసి డబ్బులిచ్చేశాడు. ఓరా! అంతలోనే ఎంత మార్పు!! యింతసేపూ ఏకధాటిన ఉపన్యసించిన మహానుభావులంతా యిలా మారిపోయారేమిటి అనిపించింది. యిది వారి "నీరసం ప్రభావమా, కాఫీ మహత్యమా" అని కించిత్సంశయం కలిగింది. నిజానికీ కాఫీ ఏమంత బాగోలేదని కొందరు కిటికీల గుండా బయటకు పోయడం చూస్తుంటేనే తెలుస్తోంది. కానీ ఏమిటీ వింత ప్రవర్తన. యింతలోనే ఎంత మార్పు యీ మనుషుల్లో... ఒకాయన "కాఫీ" తాగిన ఉత్సాహంలో రెండవ రౌండు చర్చలకు సంసిద్ధుడయ్యాడు. రైలు కదులుతూనే వుంది - ఆ చర్చలాగే...

★ ★ ★

నా మనస్సు మాత్రం ఒక్కసారి "గుంతకల్లు" పోయింది వెనక్కి.

ఆ కాఫీ కుర్రాడే - అమాయకంగా, ఆవేదనగా ... నా కళ్ళలో కదలాడాడు. ఆర్తినిండిన అతని రూపాన్ని చెరిపేయడం నాకు సాధ్యం కాని పనయ్యింది. అతని మనసును అర్థం చేసుకోని యీ సమాజానికీ, యీ సమాజపు వైఖరి తెలుసుకోలేని అతని వయసుకూ అంతరం మెల్లగా బోధపడసాగింది. అతడిమాటలే - ఆ శాపనార్థాలే, అ తిట్లే భీకరంగా ప్రతిధ్వనించ సాగాయి. అప్రయత్నంగా చెవులు మూసుకొన్నాను.

★



"నీవు అమల ఇంటి కెళ్ళినప్పుడు ఏం చేస్తుంది!" అడిగింది నిర్మల రచయిత్రి అరుణని.

"వేయి పడగలు నవల చదువుతుంది" అని చెప్పింది నిర్మల.

"అది "విశ్వనాథ సత్యనారాయణ"ది కదూ!"

"కాదు. మన ఊరి లైబ్రరీ లోది" అని చెప్పింది నిర్మల.

శ్వేత [గుంటూరు]

## బులెట్ పిల్లాడు

మనం తరుచు వార్తా పత్రికల్లో బస్సుల లోనూ, రైళ్ళలోనూ జరిగే శిశు జననాల గూర్చి చూస్తూనే ఉంటాం. అయితే అభివృద్ధి చెందిన దేశాలలో ఇలా విమానాలలో కూడా జరుగుతూ ఉంటుంది. రష్యా వంటి దేశాలలో ఈ మధ్య కొందరు స్త్రీలు డాక్టర్ల సహాయంతో బాత్ టబ్‌లనూ, స్విమ్మింగ్ పూల్స్‌నూ తమ పురిటికి వాడుకుంటున్నారు.

ఇవే కాకుండా చిత్రవిచిత్రమైన కొన్ని జననాల గూర్చి మనం ఇప్పుడు తెలుసుకుందాం.

యూపిరక్ పట్టణానికి చెందిన శ్మశానంలో ఒక స్త్రీ శవాన్ని ఖననం చేయటానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉన్నట్లుండి ఆ శవపేటిక నుంచీ ఏదో శబ్దం రావటం గమనించిన కొందరు ఆ పేటికను తెరచి చూశారు. నిండు చూలాలుగా ఉన్న ఆ స్త్రీ గర్భం నుండి ఒక శిశువు బయటపడి, రోదిస్తూ వారి కంటబడ్డాడు. ఆ తరువాత జార్జియన్ పేరుతో పెరిగి పెద్దవాడయ్యాడు. ఇంతవరకు ప్రపంచంలో, శవపేటికలో జన్మించిన శిశువు అతను ఒక్కడే.

పశ్చిమ జర్మనీకి చెందిన ఆఫెన్‌బాచ్‌లో గ్రెట్‌బార్‌డాం అనే ఆమె 1970 లో కవల పిల్లలకు జన్మనిచ్చింది. అందులో ఒక బాలుడు నీలి కళ్ళు నల్ల కురులతో తెల్లగా ఉన్నాడు. రెండవ వాడు నల్లని జుట్టుతో, చామనఛాయతోనూ ఉన్నాడు. దానికి అసలు కారణం తెల్లగా ఉన్న జర్మనీ వ్యాపారస్తునితోనూ, నల్లగా ఉన్న మరో అమెరికన్ సైనికునితో ఏకకాలంలో తాను సంభోగంలో పాల్గొనటమేనని ఆమె తరువాత తెలియజేసింది.

కాలిఫోర్నియాలోని లింకాస్టర్‌లో డైనేటు మినారో 1978, డిసెంబర్ 7వ తేదీన రెండవ సంతానంగా ఒక పిల్లవాడికి జన్మదిచ్చింది. సరిగ్గా సంవత్సరం క్రితం అదే రోజున ఒక్క నిముషం తేడాతో ఆమె మొదటి బిడ్డకు జన్మనిచ్చింది.



మిసిసిపి ప్రాంతంలో జరిగిన రేమాండ్ యుద్ధంలో పాల్గొన్న ఒక సైనికుని వృషణం నుంచి ఒక బులెట్ దూసుకుపోయి, చేరువలో ఉన్న పాకలో పని చేసుకుంటున్న 17 సంవత్సరాల యువతి గర్భసంచిలో నిక్షిప్తమైంది. అది జరిగిన తొమ్మిది నెలల, వారం రోజుల తర్వాత ఆ యువతికి పండంటి మగ బిడ్డ కలిగిగాడు. మూడు వారాల తర్వాత డాక్టరు టి.జి.వాడర్స్, ఆ బిడ్డకు ఆపరేషన్ చేసి అతడి జన్మకు కారణమైన తుపాకి గుండును బయటకు తీశారు. ఆ బాలుడు ముమ్మూర్తులా దెబ్బతిన్న సైనికుడిని పోలి ఉండటం అందర్నీ ఆశ్చర్యపరచింది. ఆ డాక్టరు గారే, మరి కొందరు మిత్రుల సహకారంతో ఆ బాలుడి తల్లి-తండ్రులకు వివాహం జరిపించాడు.

ఈ జెట్ యుగంలో మనం త్వరలోనే అంతరిక్షంలో పుట్టిన మొదటి పాప / బాలుడు గూర్చి త్వరలోనే వినవలసి వస్తుందేమో!

— ఎం.ఎస్.రామకృష్ణ